క్లుప్తంగా

ప్రభుత్వాసుపత్రికి వితరణ



దాతలందించిన కట్టుగుడ్డలు అందుకుంటున్న వైద్యాధికారి

చినగంజాం: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అవసరమైన కట్టుగుడ్డలను దాత వలివేటి విశ్వనాథ బాబు అందజేశారు. తన సొంత ఖర్చులతో కట్టు గుడ్డలను కొనుగోలు చేసి శనివారం వైద్యాధికారి డాక్టర్ పి. సాయిశ్రీచరణ్‌కు అందజేశారు. ప్రతి ఏడాది ఆసుపత్రికి ఆయన సొంత ఖర్చులతో మెటీరియల్‌ను సమకూర్చుతుండటం ఆనవాయితీగా వస్తోందని వైద్యాధికారి తెలిపారు. సుబ్బారావు, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ మేళా రేపు



బల్లికురవ సబ్‌స్టేషన్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

బల్లికురవ: రైతులకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి బల్లికురవ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు పంపిణీ చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ కె. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. మండలానికి 25 కేవీ ట్రాన్స్ ఫార్మర్లు 50 కేటాయించారని చెప్పారు. వీటిలో ప్రాధాన్యత క్రమంలో వైదనకు 10, వెలమవారిపాలెంకు 9, ఎస్ఎల్ గుడిపాడుకు 5, కొమ్మినేనివారిపాలెంకు 4, కొణిదెనకు 3, చెన్నుపల్లికి 3, ముక్తేశ్వరానికి 2, కొప్పరపాలెంకు 2 చొప్పున రాగా.. చోరీకి గురైన రైతులకు కూడా అందజేస్తామని తెలిపారు. రైతులు పొలాల వద్దకు చేర్చుకుంటే సిబ్బంది వెంటనే కనెక్షన్లు ఇస్తారని వివరించారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణం కోసం రిలే దీక్షలు

వేటపాలెం: పందిళ్లపల్లిలోని ప్రభుత్వం ప్రాథమిక వైద్యశాల నూతన భవనం నిర్మాణం చేపట్టాలని కోరుతూ జర్నలిస్టు చెరుకూరి రాంబాబు రిలే నిరాహార దీక్షలు శనివారం చేపట్టారు. రాంబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా పెంకుటింట్లో వైద్యశాల కొనసాగుండగా.. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరిందన్నారు. గత ప్రభుత్వం వైద్యశాల నిర్మాణం కోసం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అయితే అధికారులు కుంటి సాకులు చెప్పి కాలం వెల్లదీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా రోటరీ యువజన వారోత్సవాలు



ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో చిన్నారులు

చీరాల అర్బన్: రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో రోటరీ సామాజిక భవనంలో రోటరీ యువజన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం చిన్నారులకు ఫ్యాన్సీ డ్రెస్, క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ మాస్టర్‌గా దోగుపర్తి వెంకట సురేష్ వ్యవహరించారు. క్లబ్ ప్రతినిధులు చందలూరి బాలవెంకటేశ్వరరావు, వలివేటి మురళీకృష్ణ, పోలుదాసు రామకృష్ణ, డాక్టర్ ఐ.బాబూరావు, గుర్రం రాఘవరావు, సందు నాగరాజు, రమేష్‌బాబు, ఎంవీ రామారావు, మామిడాల శ్రీనివాసరావు, జీవై ప్రసాద్, టి.లక్ష్మీప్రతాప్, చుక్కా శ్రీనివాసరావు, సుభాషిణి, భాను, తవ్వా పద్మ, రూపాదేవి పాల్గొన్నారు.

ఎంత కష్టం.. ఎంత నష్టం!





మినుము పంట మిషన్ వేస్తున్న రైతులు

- అధిక వర్షాలతో దెబ్బతిన్న మినుము పంట
- ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి
- పంటవిస్తీర్ణం 2400 ఎకరాలు.. నష్టం 1800 ఎకరాల్లో..
- ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి
- పంట నష్టపరిహారంపై రైతుల ఆందోళన

జె.పంగులూరు: ఆరుగాలం పండించిన పంటలను, రైతు చేతికందే సమయానికి అధిక వర్షాలతో నేల పాలు అవుతున్నాయి. ప్రభుత్వం పంట నష్టపరిహారంపై ఇంతవరకు ఏమీ తేల్చకపోవడంతో అన్నదాతలు అయోమయంలో పడ్డారు. కరీఫ్‌లో వేసిన మినుము పంట గత రెండు సంవత్సరాలుగా రైతుల చేతికి అందటం లేదు. గత సంవత్సరం మినుము రైతులు పూర్తిగా నష్టపోయినా.. నాటి ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం రైతులకు అందించింది. రైతులకు రైతు భరోసా ఇచ్చి కొంత ఆదుకుంది. కానీ ఈ ఏడాది మినుము నష్టం జరిగినా ఎవరూ స్పందించడంలేదు.

పెట్టుబడులు ఇలా..

మినుము పంట ఎకరాకు సాగు చేయాలంటే విత్తనాలు రూ. 3 వేలు, వ్యవసాయ ఖర్చులు రూ. 13 వేలు, కోత కూలి రూ.4000, మిషన్ ఖర్చు రూ. 4000 వరకు అవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో మినుము పంట పండించేందుకు ఎకరాకు రైతులు రూ. 25 వేల వరకు ఖర్చు పెట్టారు. అయితే అధిక వర్షాలతో మినుము పంట పూర్తిగా నష్టాలను చవిచూడాల్సిన దుస్థితి దాపురించింది.

ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి

అధిక వర్షాలతో ఈ సంవత్సరం ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని రైతులు చెబుతున్నారు. దీంతో అవి కొనేందుకు ఎవరూ ముందుకు రావటంలేదని వాపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మినుములు రూ. 7 వేలు నుంచి రూ. 8 వేలు వరకు ధర పలుకుతున్నాయి. కానీ అధిక వర్షాలతో మినుము పూర్తిగా పాడైపోయింది. గింజ బూజు పట్టుకుపోయిందని.. కొనేందుకు వ్యాపారలు ఎవరూ ముందుకు రావటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఆశాలన్నీ మొక్కజొన్నపైనే!

ఖరీఫ్‌లో వేసిన మినుము పంట చేతికి అందలేదు. దీంతో రబీలో వేసే మొక్క జొన్న పంటపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఎకరాకు రూ. 25 వేలు కౌలుకు కడితే.. రెండు పంటలు వేసేందుకు అనువుగా ఉంటుంది. దీంతో ముందు మినుము, తరువాత మొక్కజొన్న వేస్తున్నారు. గత సంవత్సరం కూడా మినుము రైతులు వర్షాల వల్ల నష్టాలు పాలు అయినా నాటి ప్రభుత్వం ఆదుకుంది. అనంతరం వేసిన మొక్కజొన్న మంచి దిగుబడి ఇచ్చి పంటకు గిట్టుబాటు ధర పలకటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంవత్సరం కూడా రైతుల ఆశాలన్నీ రెండో పంట అయిన మొక్కజొన్న పైనే ఉంది.

5 ఎకరాల్లో మినుము పంట వేశా



నేను ఎకరాకు రూ. 25 వేలు ముందు కౌలుకు కట్టాను. 5 ఎకరాల్లో మినుము పంట వేశాను. మొత్తం మీద నాకు రూ. 1.25 లక్షలు పెట్టుబడితో పాటు, రూ. 1.25 లక్షలు కౌలు కట్టాను. 5 ఎకరాల మీద 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కానీ గింజ నాశిరకంగా ఉంది. కొనేందుకు వ్యాపారులు ముందుకు రావటంలేదు. ప్రభుత్వం ఎకరాకు రూ. 20 వేలు వరకు పంట బీమా అందిస్తే పెట్టుబడులు అయినా వస్తాయి.

– కొమ్మారెడ్డి వెంకారెడ్డి, కౌలు రైతు, బూదవాడ

రెండో పంటమీదనే ఆశలు



గత రెండు సంవత్సరాలుగా అధిక వర్షాలతో ముందు సాగు చేస్తున్న మినుము పంట చేతికందటంలేదు. రబీలో వేసిన మొక్కజొన్న పంట మీదనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి మాకు వస్తున్న లాభాలు ఏమీ లేవు.

– వీరారెడ్డి, బూదవాడ

మినుము పంట నష్టం అంచనా పూర్తి

ఖరీఫ్ సీజన్‌లో వేసిన మినుము పంట అధిక వర్షాలకు దెబ్బతింది. మండలంలోని పంట నష్టం ఇప్పటికే అంచనా వేశాం. 2024కి ఖరీఫ్ సీజన్‌కు గాను మండలంలో 2400 ఎకరాల్లో మినుము సాగు చేస్తున్నాం.

– సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి

చెరుకూరులో పల్లెనిద్ర

- పాల్గొన్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



పల్లె నిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ విఠలేశ్వర్, పోలీస్ అధికారులు

పర్చూరు (చినగంజాం): ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి జిల్లా పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనపు ఎస్పీ విఠలేశ్వర్, పర్చూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ మాల్యాద్రితో కలిసి చెరుకూరు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి గ్రామంలో బస చేసి ప్రజలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. స్థానికంగా ఉన్న సమస్యల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల జరుగుతున్న తీరును గురించి ప్రజలకు వివరించి వాటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకొని వస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దొంగతనాలు జరగకుండా వ్యాపార సముదాయాలు, దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మార్పీకే ఎరువుల విక్రయం



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఏడీఏ భాస్కరరావు

చీరాల: చీరాల సబ్ డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, చిన్నగంజాం మండలాల్లో ప్రస్తుత రబీ సీజన్‌కు సరిపడా ఎరువులు పుష్కలంగా ఉన్నాయని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.భాస్కరరావు తెలిపారు. రబీ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 12,230 హెక్టార్లు ఉండగా ఇప్పటికి 517 హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారన్నారు. మూడు మండలాల్లో అన్ని ఎరువుల దుకాణాల్లో యూరియా 370 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలున్నట్లు చెప్పారు. ఎరువుల దుకాణాల తనిఖీల్లో భాగంగా డీలర్లు రైతులు అడిగిన ఎరువులు మాత్రమే విక్రయిస్తున్నారని చెప్పారు. కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే యూరియా బస్తాలు ఇస్తామనే షరతులు విధించలేదన్నారు. అలానే ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయిస్తున్నారన్నారు. రైతుల నుంచి కూడా ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

వేటపాలెం: అనుమతులు లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పార్వతి హెచ్చరించారు. వేటపాలెం సర్వే నెంబర్ 257లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ప్రాంతాన్ని ఎస్సైతో కలిసి పరిశీలించారు. ఇసుక తరలింపుకు ఉపయోగిస్తున్న జేసీబీని పట్టుకొని సీజ్ చేశారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఇసుక తరలించడం నిషేధించామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల నుంచి సొంత అవసరాల కోసం ఇసుక ఉచితంగా తరలించు కోవచ్చన్నారు. అంతే గాని ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూముల్లో ఇసుక తరలింపు కోసం తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్సై వెంకటేశ్వర్లున్నారు.

మాలధారులకు అన్నదానం ప్రారంభం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న టీఎస్సార్ ఆంజనేయులు దంపతులు, భక్తులు



మాలధారణ స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

చినగంజాం: కార్తీక మాసం పురస్కరించుకొని ప్రతి ఏడాది మాదిరిగా లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వర స్వామి ఆలయం, హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మాలధారణ చేసిన స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పడిపూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మలపెంట సీతారామాంజనేయులు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో గత 16 సంవత్సరాల నుంచి అయ్యప్ప, శివస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఏడాది నవంబరు 2వ తేదీ నుంచి డిసెంబర్ 11వ తేదీ వరకు మాలధారణ చేసిన స్వాములకు అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప, శివ మాలధారణ చేసిన స్వాములతో పాటు భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కుట్టు శిక్షణ

మార్టూరు: స్థానిక కొణిదెన రోడ్డులో గల అమ్మ అనాథాశ్రమంలో సోమవారం ఉదయం నుంచి మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు శనివారం ప్రకటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమంలో మహిళలకు స్కూలు యూనిఫారం బట్టల పై కుట్టు శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు.. 9391620850 నంబరును సంప్రదించాలని కోరారు.

గోశాలకు దాణా అందజేత



గోశాలకు తవుడు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకి రూరల్: కార్తీకమాసం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రోటరీ మిత్రులు శనివారం స్థానిక హరిహర గోశాలకు 3 బస్తాల తవుడు దాణా అందజేశారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ కార్తీకమాసం ప్రారంభంలో భాగంగా రోటరీ మిత్రుల సహకారంతో గోవులకు తవుడు, దాణా అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, పసుపులేటి ఆంజనేయులు, కొల్లిపర నాగయ్య, ఉరిటి శ్రీనివాసరావు, గుళ్లపల్లి సుబ్రమణ్యం, గోశాల నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు ఎక్కడ?



ఎంఈఓకు సమస్య వివరిస్తున్న సర్పంచ్ బ్రహ్మానంద రెడ్డి

చినగంజాం: పాఠశాల నిర్వాహణకు ఉండాల్సిన కనీస అర్హతలు లేకుండా ఎలా నిర్వహిస్తారంటూ కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి విద్యాశాఖాధికారులను ప్రశ్నించారు. శనివారం మండల విద్యాశాఖాధికారి బొల్లిముంత అజయ్‌బాబుతో కలిసి కొత్తపాలెం గ్రామ పంచాయతీలో ఇటీవల ఏర్పాటు చేసిన చైతన్య పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఆటస్థలం, మరుగుదొడ్లు, సౌకర్యవంతమైన తరగతి గదులు, ఉపాధ్యాయ శిక్షణ లేని సిబ్బంది లేకపోవడాన్ని గుర్తించారు. కనీసం పంచాయతీ అనుమతి లేకుండా కట్టడాలు నిర్మాణం చేసి పాఠశాల సాగిస్తున్న తీరును తప్పుబట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడవద్దని కోరారు. అనుమతులు పొందితే దానిని కొనసాగించాలని లేకుంటే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యదర్శి బాబురావు, సచివాలయ సిబ్బంది బి. సుబ్బారెడ్డి, ఎంఆర్‌సీ సిబ్బంది మురళీరెడ్డి, పంచాయతీ సిబ్బంది రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

● కార్తీకం.. శుభకరం



చీరాల: ప్రత్యేక అలంకరణలో పేరాలలోని పునుగు రామలింగేశ్వరస్వామి



కారంచేడు పెద బజారు శివాలయంలోని స్వామివారు

చీరాల అర్బన్: కార్తీక మాసం తొలి రోజు శనివారం దేవాలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. పట్టణంలోని దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. చీరాల, పేరాల శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కారంచేడు: కార్తీకమాసం ప్రారంభ ప్రత్యేక పూజలను భక్తులు భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతుండటంతో శివాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ఆధ్యాత్మిక ప్రవచనం

చీరాల రూరల్: ఆధ్యాత్మిక పీఠం చీరాల వారి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు స్వర్ణ రోడ్డులోని లయన్స్ క్లబ్ బిల్డింగ్‌లో రామాయణం పాత్రల ఉదాత్తత అనే ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు పీఠం అధ్యక్షుడు వి. వెంకటరావు శనివారం తెలిపారు. ప్రవచన ఉపన్యాసకులుగా నరసరావుపేటకు చెందిన సంస్కృత ఉపన్యాసకులు మంత్రిరాజు శివరామయ్య వ్యవహరించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందుకోవాలని కోరారు.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

బల్లికురవ: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సంతమాగులూరు సీఐ కె. వెంకటరావు సూచించారు. శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో వేమవరం గ్రామానికి చెందిన రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గ్రామంలో ప్రశాంత వాతారణానికి ప్రాధాన్యత ఇవ్వాలని వర్గాలు పార్టీలు వీడి ఒకరికొకరు ఐక్యతతో కలిసిమెలసి జీవించాలన్నారు. గ్రామంలో అలజడులు, అల్లర్లు సృష్టిస్తే శాఖ పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంకొల్లు డిపో నిర్మాణానికి కృషి



మాజీ మంత్రి గాదె వెంకట రెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు ఆర్టీసీ డిపో నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని మాజీ దేవాదాయ శాఖ మంత్రి గాదె వెంకటరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇంకొల్లు డిపో నిర్మాణం పెండింగ్‌లో ఉందని నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడుతో దీనిపై చర్చిస్తానని తెలిపారు. ఇంకొల్లులో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే ఉపయోగ పడతాయని తెలిపారు. 1983 నుంచి తాను ఎన్నోసార్లు ఈ ప్రాంత ఎంఎల్ఏగా పోటీ చేశానని గుర్తు చేశారు.

100 మంది హనుమత్ మండల దీక్ష స్వీకరణ

అద్దంకి రూరల్: మండలంలోని శింగరకొండలో శనివారం కార్తీక మాసం సందర్భంగా దేవస్థానంలో 100 మంది భక్తులు హనుమత్ మండల దీక్షలను స్వీకరించారు. మొదటి శనివారం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు దేవస్థాన సహాయ కమిషనర్ యం. తిమ్మనాయుడు శనివారం మధ్యాహ్నం భోజనవసతి కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మార్టూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన స్థానిక జాతీయ రహదారిపై బొల్లాపల్లి, కోలలపూడి గ్రామాల మధ్య శనివారం రాత్రి జరిగింది. గుంటూరు శివ నాగరాజు కాలనీకి చెందిన పరిసపోగు దిలీప్ ఒంగోలు వైపు నుంచి గుంటూరుకు స్కూటీపై వెళుతున్నాడు. జె. పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామానికి చెందిన పత్తి పోగు పవన్ కళ్యాణ్ కోలలపూడి సమీపంలోని గోడౌన్లలో ఉద్యోగం చేస్తూ పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామం వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొనడంతో పవన్ కళ్యాణ్ కాలు విరగగా, దిలీప్‌కు కనిపించని గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హైవే మొబైల్ సిబ్బంది మార్టూరు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో దిలీప్‌ను గుంటూరు తరలించారు.